Namasthe Telangana dt 03/02/14

# 'మెట్రో' ప్రపంచ ఖ్యాతి పొందుతుంది

## ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

విజయ్‌నగర్‌కాలనీ, ఫిబ్రవరి 2 (టీ మీడియా) : 20 సంవత్సరాలుగా దేశంలో ఎంతో మార్పు వచ్చిందని, సింగపూర్, టోక్యో, హాంగ్‌కాంగ్ వంటి నగరాలలో మెట్రోరైలు ప్రాజెక్ట్ వలన ఎంతో సుందరంగా తీర్చిదిద్దబడ్డాయని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం అబిడ్స్ రాజస్థాని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎన్వీఎస్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన హైదరాబాద్ కూడా ప్రజలు, నాయకులు ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలోనే అత్యంత సుందరమైన నగరంగా తయారౌతుందన్నారు. మెట్రోరైలు ఏర్పాటు వలన రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్క స్టేషన్ ప్రపంచంలోనే అతి పెద్ద మెట్రోరైలు ప్రాజెక్ట్‌గా హైదరాబాద్‌లో తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.72 కిలోమీటర్లు, 66 స్టేషన్లు, 63 లోకేషన్లలో 14 వేల కోట్ల రూపాయలతో ఫేజ్ 1 మెట్రో రైలు ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతి పెద్దదిగా గుర్తిం పు పొందుతుందన్నారు. వీటికి కావలసిన సామాగ్రిని సౌత్ కొరియా, యూఎస్ ప్రాంచైజ్‌ల నుంచి తెప్పిస్తున్నట్లు వివరించారు. అత్యాధునిక నైపుణ్యం కలిగిన ఇంజినీర్లచే మెట్రోరైలు నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అబిడ్స్ రాజస్థాని గ్రాడ్యుయేట్స్ అసోషియేషన్ ప్రతినిధులు ఎన్వీఎస్ రెడ్డికి లక్ష రూపాయల విరాళాన్ని తమ సంస్థ తరుపున అందజేశారు. సంస్థ సభ్యులు రమేష్‌కుమార్ భట్టడ్, సంపత్ బియాని, హరికిషన్ ఓజా, సురేష్ చంద్ కాబ్రా, బీజేపీ నాయకులు గోవింద్ రాఠి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మెట్రోరైలుఎండీ ఎన్వీఎస్ రెడ్డి